క్లుప్తంగా

పర్యాటకాభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తా



ఎస్.యానాం బీచ్‌లో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు, కలెక్టర్ మహేష్‌కుమార్ తదితరులు

ఉప్పలగుప్తం: ఎస్.యానం సముద్ర తీర ప్రాంతాన్ని పర్యటకంగా ప్రత్యేక కృషి చేస్తానని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. మండలంలోని ఎస్.యానాం తీరంలో రూ.2 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు శుక్రవారం ఆయన జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్‌తో కలసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో జి.కేశవవర్ధన్‌రెడ్డి, సర్పంచ్ జోగి రాజేశ్వరి, ఎంపీటీసీ సభ్యుడు పెట్టా అప్పారావు, అరిగెల నానాజీ, దేశంశెట్టి లక్ష్మీనారాయణ, పళచోళ్ల పద్మనాభం, సత్తి చిన్న, మేకల నానాజీ, కోటిపల్లి రాజు, పంచాయతీ రాజ్ ఇంజినీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పవన్‌కుమార్‌కు అవార్డు



యువ పారిశ్రామికవేత్త అవార్డు అందుకుంటున్న పవన్‌కుమార్

అమలాపురం టౌన్: పట్టణానికి చెందిన నల్లా పవన్‌కుమార్‌కు యంగ్ ఎంటర్ ప్రెన్యూర్ అవార్డు లభించింది. న్యూఢిల్లీలోని ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్‌లో శుక్రవారం పవన్‌కుమార్ ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ఎంపీ చందన్ చౌహాన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. జాతీయ సంస్థ రాజనీతి పాఠశాల నిర్వహించిన సర్వేలో హోటల్స్ వ్యాపారంలో విజయవంతమైన పవన్‌కుమార్ ఈ అవార్డుకు ఎంపికయ్యారు. ఈయన బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడిగా కూడా పనిచేస్తున్నారు. రాజనీతి పాఠశాల జాతీయ అధ్యక్షుడు అజయ్ పాండా తదితరులు అవార్డు అందుకున్న పవన్‌కుమార్‌ను అభినందించారు.

తాళ్లరేవు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా సుకీర్తి

తాళ్లరేవు: మండల ఆర్‌డబ్ల్యూఎస్ అసిస్టెంట్ ఇంజినీర్‌గా డి.సుకీర్తి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పనిచేసిన తాడిచర్ల మారుతీరావు కాకినాడ రూరల్ మండలానికి బదిలీ కాగా ఆయన స్థానంలో సుకీర్తి వచ్చారు. ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజును ఆమె మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. మండలంలోని నాయకులను, అధికారులను సమన్వయం చేసుకుని ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎమ్మెల్యే సుకీర్తికి సూచించారు.

జేఏవోగా బేతాళం కుమార్‌కు పదోన్నతి

యానాం: యానాం విద్యాశాఖలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న బేతాళం కుమార్‌కు జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్(జేఏవో)గా పదోన్నతి లభించింది. పుదుచ్చేరి వ్యాప్తంగా 21 మంది పదోన్నతి పొందగా యానాం నుంచి బేతాళం కుమార్ ఒకరు. జేఏవోగా పదోన్నతి కల్పిస్తూ శుక్రవారం స్థానిక ప్రభుత్వ సామాన్య ఆసుపత్రికి బదిలీ చేశారు. ఈ మేరకు పుదుచ్చేరి ఆర్థికశాఖ కార్యదర్శి రత్నఘాష్ కిషోర్‌చౌరే ఆదేశాలు జారీ చేశారు. ఆర్‌ఏవో మునిస్వామిని బేతాళం కుమార్ దుశ్శాలువాతో సత్కరించారు.

సఫాయి కర్మచారి పని చేయిస్తే ఫిర్యాదు చేయండి

యానాం: అనాగరికమైన సఫాయి కర్మచారి పనిని పూర్తిగా రూపుమాపేందుకు ఆ పనిని నిషేధించినట్లు ఒకవేళ అటువంటి మాన్యువల్ స్కావెంజర్ పనిలో ఎవరైనా పాల్గొంటే తక్షణం ఫిర్యాదు చేయాలని శుక్రవారం పుదుచ్చేరి జిల్లా మెజిస్ట్రేట్ ప్రకటన విడుదల చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పుదుచ్చేరి జిల్లా వ్యాప్తంగా మాన్యువల్ స్కావెంజర్, ఇన్‌ఫెంట్రీ లెట్రిన్‌లను గుర్తించుట కోసం స్థానిక పాలనా యంత్రాంగం ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి సర్వే చేసినట్లు తెలిపారు. ఎవరైనా ఇంకా సఫాయి కర్మచారి పని నిర్వహిస్తే 15 రోజుల లోపు సంబంధిత ఆధారాలతో రాతపూర్వకంగా అభ్యంతరాన్ని దాఖలు చేయాలని కోరారు. ఈ మేరకు యానాంలో సంబంధిత ప్రకటనను ఆర్‌ఏఒ మునిస్వామి జారీ చేశారు.

నగర రవాణా ప్రణాళికపై సాంకేతిక సదస్సు

అల్లవరం: ఓడలరేవు బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో నగర రవాణా ప్రణాళికపై శుక్రవారం సాంకేతిక సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ చంద్రమౌళి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి వరంగల్ ఎన్ఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రఘురాం కడలి విచ్చేశారు. స్మార్ట్ మొబిలిటీ అనేది రవాణా వ్యవస్థలను మెరుగుపరచడానికి సాంకేతికత, డేటా ఆధారిత పరిష్కారాల కొరకు వినియోగాన్ని సూచిస్తుందన్నారు. రవాణా వ్యవస్థలో విద్యుత్‌తో కూడిన వాహనాలను వినియోగించడం ద్వారా కాలుష్యాన్ని నియంత్రించవచ్చన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆ కాలనీలకు దారేదీ?

- పద్దెనిమిదేళ్లుగా వెంటాడుతున్న మౌలిక వసతుల లేమి
- జనుపల్లి న్యూ, చీకట్లపాలెం ఇందిరమ్మ కాలనీలకు తప్పని తిప్పలు



వర్షపునీటిలో ఇబ్బందులు పడుతూ విద్యార్థులను పాఠశాలకు తీసుకువెళుతున్న కాలనీ వాసి (ఫైల్)

అమలాపురం రూరల్: ప్రభుత్వం నిరుపేదలకు రూ.కోట్లు ఖర్చు చేసి భూములు కొని, కాలనీలు ఏర్పాటు చేసి ఇళ్ల పట్టాలు ఇచ్చారు. అధికారులు కాలనీలకు వెళ్లడానికి దారి ఏర్పాటు చేయకపోడంతో 18 ఏళ్లుగా కాలనీల వాసులు దారిలేక ఇబ్బందులు పడుతున్నారు. దారి కోసం ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నా సమస్యకు పరిష్కారం చూపకపోవడం కాలనీలవాసులకు అవస్థలు తప్పడం లేదు. అమలాపురం మండలం జనుపల్లిలో రెండెకరాల భూమిలో 2007లో అప్పటి ఎమ్మెల్యే కుడుపూడి చిట్టబ్బాయి 182 మందికి అమలాపురం పట్టణ వాసులకు ఇళ్ల పట్టాలు ఇచ్చారు. కాలనీలకు అప్పట్లో అధికారులు రహదారి సదుపాయం కల్పించలేదు. ఈ కాలనీలో సుమారు 82 ఇళ్లు బేసిమెంట్ లెవెల్‌లో నిలిచిపోగా, 100 ఇళ్ల స్థలాల వరకూ ఖాళీగానే దర్శనమిస్తున్నాయి. ఈ పట్టాల్లో కొందరు ఇళ్లు నిర్మించుకున్నప్పటికీ కాలనీలకు వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. కలెక్టర్ కార్యాలయానికి కూత వేట దూరంలో ఉన్న ఈ దారి లేని జనుపల్లి కాలనీ వాసులు గత 18 ఏళ్లుగా రోడ్డు, తాగునీరు, మౌలిక వసతులకు దూరంగా ఉండటంతో కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. దారి కోసం ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నా.. ఇంతవరకు సమస్యకు పరిష్కారం చూపలేదని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కాలనీవాసులు కలెక్టర్ ఆఫీస్ వద్ద నిరసన ప్రదర్శన చేశారు. ముగ్గురు ఆర్డీవోలు, ముగ్గురు తహసీల్దార్లు సంఘటన స్థలాన్ని వచ్చి చూసినప్పటికీ పరిష్కార మార్గం చూపలేదు. కొంతమంది రైతులు పొలాల్లో నుంచి దారి ఇవ్వడానికి అభ్యంతరం చెబుతున్నారు. ఇప్పటి వరకు 12 సార్లు కలెక్టరేట్‌లో వినతిపత్రాలు ఇచ్చినా సమస్యల పరిష్కారం జరగలేదని కాలనీ వాసులు చెబుతున్నారు. వర్షాకాలంలో కాలనీ ముంపుబారిన పడటంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. రైతుల పొలాలో ముంపునీటిలో నడచి వెళ్లి ప్రమాదాల బారిన పడుతున్నారు. మహిళలు, వృద్ధులు, చిన్నారులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

చీకట్లపాలెం ఇందిరమ్మ కాలనీకి ఇదే దుస్థితి

ఉప్పలగుప్తం శివారు చీకట్లపాలెం ఇందిరమ్మ కాలనీ ఏర్పడి 18 ఏళ్లయినా ఇప్పటివరకూ కాలనీకి రాకపోకలకు సరైన మార్గం, రోడ్డు, డ్రైనేజీలు, కుళాయిలు, కరెంటు, వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయలేదని కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. కొద్దిపాటి వర్షం కురిసిందంటే చుట్టుపక్కల రైతుల పొలాల్లో వరద నీటిలో నడుచుకుంటూ ఇళ్లకు వెళ్లవలసి వస్తుందన్నారు. కాలనీలో మహిళలు, పాఠశాల విద్యార్థులు గృహాల నుంచి బయటకు వెళ్లాలన్నా.. రావాలన్న నానాపాట్లు పడుతున్నారని ఇటీవల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారవేదికలో అధికారులకు కాలనీవాసులు వినతిపత్రం అందించారు. 2007లో ప్రభుత్వం ఇందిరమ్మ గ్రామంగా ఎంపిక చేసి నివాస స్థలాలు లేని 35 మంది నిరుపేదలకు గ్రామంలో సర్వే నంబర్ 361/ 9,10,11లో 1.08 ఎకరాల భూమిని ప్రభుత్వం కొనుగోలు చేసి ఒక్కో లబ్ధిదారునికి రెండు సెంట్ల స్థలం చొప్పున లేఅవుట్ చేసి పట్టాలు ఇచ్చారు. అందులో కొంతమంది పక్కా గృహాలు, కొంతమంది పూరిపాకలు వేసుకుని నివాసం ఉంటున్నారు. కాలనీలో కనీసం రాకపోకలకు దారి, రోడ్లు, తాగునీరు వంటి వసతులు లేకపోవడవంతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఆశపు సత్యవేణి, చీకట్ల నాగబాబు, వరచర్ల వెంకటేశ్వరరావులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఇబ్బందులు పడుతున్నాం



కాలనీకు దారిలేక అనేక ఇబ్బందులు పడుతున్నాం. వర్షాకాలంలో ముంపునీటిలో వెళ్లవలసి వస్తుంది. వృద్ధులు, చిన్నారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇళ్లలో పాములు రావడంతో భయపడుతున్నాం. అధికారులు సౌకర్యాలు కల్పించాలి.

– నాగమగిరి వెంకటలక్ష్మి, జనుపల్లి న్యూకాలనీ, అమలాపురం

అధికారులు దయ చూపాలి



తమ కాలనీ సమస్యలపై ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవాలి. 18 ఏళ్లుగా అనేక అవస్థలు పడుతున్నాం. కాలనీలో రోడ్డు, డ్రైనేజీలు కుళాయిలు, కరెంటు, వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ దయ చూపి సమస్యలు పరిష్కరించాలి.

– అల్లాడ రమేష్, జనుపల్లి న్యూకాలనీ, అమలాపురం

నాణ్యతతో కూడిన భోజనం పెట్టండి



గోడి బాలుర గురుకులాన్ని సందర్శిస్తున్న జేసీ నిశాంతి

అల్లవరం: గురుకులాల్లోని విద్యార్థులకు నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనాలు పెట్టాలని అధికారులను జేసీ టి.నిశాంతి ఆదేశించారు. అల్లవరం మండలం గోడిలోని బాలురు గురుకులాన్ని శుక్రవారం సందర్శించారు. గురుకులంలోని విద్యార్థులకు అందిస్తున్న భోజనం రుచికరంగా లేదని, చాలీచాలని కూరగాయలతో కూరలు తయారు చేసి విద్యార్థులకు వడ్డిస్తున్నారని పేరెంట్స్ కమిటీ సభ్యులు జేసీ దృష్టికి తీసుకొచ్చారు. బుధవారం మధ్యాహ్నం భోజనంలో ఉల్లిపాయలు లేకుండా బంగాళాదుంప కూర వడ్డించారని తెలిపారు. గురుకులంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు ఎవరూ బాధ్యతగా ఉండడం లేదన్నారు. దీనిపై జేసీ నిశాంతి స్పందించారు. గురుకులానికి సరకులు సప్లయ్ చేసే సప్లయ్‌దారులు ఎక్కడని డీసీఓ వెంకటరావుని ప్రశ్నించారు. సరకులు సప్లయ్ చేసే ఏజెన్సీలు ఇక్కడ ఉండాలని ముందుగా చెప్పినా పట్టించుకోరా అన్ని డీసీఓపై జేసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. సప్లయ్‌దారులను పిలిచి నాణ్యమైన సరుకులు పంపిణీ చేయాలని చెప్పండి, వారు పద్ధతి మార్చుకోకపోతే నోటీసులు ఇచ్చి బ్లాక్ లిస్టులో పెట్టాలని డీసీఓని ఆదేశించారు. సరుకులు నాణ్యతగా లేకపోతే ప్రిన్సిపాల్‌గా మీరే నోటీసులు ఇవ్వాలని జేసీ అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణగా ఉండేలా పీడీ, పీఈటీలు బాధ్యత తీసుకోవాలన్నారు. గురుకులానికి నాణ్యమైన సరుకులు సరఫరా చేయకపోతే బ్లాక్ లిస్టులో పెట్టి కొత్తగా టెండర్లు పిలుస్తామన్నారు. విద్యార్థులకు బోధిస్తున్న బోధన విధానంపై ఆరా తీశాం. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాలు పెడుతున్నారా.. లేదా అనే విషయాలపై పరిశీలన చేశామన్నారు. టాయిలెట్లు మరమ్మతులకు అంచనాలు తయారు చేసి పంపాలన్నారు. జేసీ వెంట తహసీల్దార్ నరసింహారావు, డీసీఓ వెంకటరావు, ఆర్ఐ దుర్గా శ్రీనివాస్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, పీఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు కామనగరువు విద్యార్థులు



జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన కామనగరువు విద్యార్థులు

అమలాపురం రూరల్: ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన నియోజకవర్గ స్థాయి స్కూల్ ఫెడరేషన్ గేమ్స్‌లో కామనగరువు ఉన్నత పాఠశాల విద్యార్థులు వివిధ క్రీడల విభాగంలో ప్రతిభ కనబరిచారు. జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించారు. వాలీబాల్, యోగా షటిల్ బ్యాడ్మింటన్‌లో పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులను జెడ్పీటీసీ పందిరి శ్రీహరిరామ్‌గోపాల్, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, సర్పంచ్ నక్కా అరుణకుమారి, ఉపసర్పంచ్ రాజులపూడి భాస్కరరావు, హెచ్ఎం జీవీ.చక్రధరరావు, పీఈటీ శ్రీనివాసరావు అభినందించారు.

ఆదిత్య పాఠశాలలో..

అమలాపురం రూరల్: ఉప్పలగుప్తం మండల గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ గేమ్స్‌లో కామనగరువు ఆదిత్య పాఠశాల విద్యార్థులు వివిధ క్రీడల విభాగంలో ప్రతిభ కనబరిచారు. జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించారు. బాలుర అండర్–17 విభాగంలో బాలమణికంఠ సాయి వాలీబాల్‌లో, డానీకుమార్ షాట్‌పుట్‌లో మొదటి స్థానంలోను, తనీష్ నాగ కుమార్ 100 మీటర్ల పరుగులో మొదటి స్థానం, లాంగ్ జంప్‌లో మూడో స్థానంలో, దిలీప్‌కుమార్, నిఖిల్ 800 మీటర్ల పరుగు పందెంలో రెండు, మూడు స్థానాలు సాధించారు. ఎంపికై న విద్యార్థులను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, డైరెక్టర్ శృతిరెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చలపతిరావు, పాఠశాల ప్రిన్సిపాల్ బి.రామప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ జి.లక్ష్మీసుధ పీఈటీలు విజయకృష్ణ, వెంకటశివ, రాఘవి అభినందించారు.

శిఖామణికి కవికోకిల పురస్కారం



శిఖామణి

యానాం: యానాంకు చెందిన సుప్రసిద్ధ కవి, కవిసంధ్య సంపాదకుడు డాక్టర్ శిఖామణి గుర్రం జాషువా కవికోకిల పురస్కారానికి ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ, ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం ఈ పురస్కారానికి తనను ఎంపిక చేసినట్లు శుక్రవారం శిఖామణి తెలిపారు. పద్మభూషణ్, కవికోకిల గుర్రం జాషువా జయంతిని పురస్కరించుకుని అవార్డును ప్రకటించారన్నారు. ఈ నెల 28న ఎన్టీఆర్ జిల్లా విజయవాడ పింగళి వెంకయ్య సమావేశ మందిరం కలెక్టరేట్‌లో జరిగే జాషువా జయంతి సభలో పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారన్నారు. శిఖామణితో పాటు దుగ్గనపల్లి ఎజ్రాశాస్త్రి, టి.వరప్రసాద్, పి.రమణయ్య కవికోకిల పురస్కారానికి ఎంపికైన వారిలో ఉన్నారు. జయంతి సభకు ప్రత్యేక అతిథులుగా ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్, కలెక్టర్ సృజన, కవులు, రచయితలు తదితరులు పాల్గొనున్నారన్నారు.

సమస్యలపై సభ్యుల ధ్వజం



ముమ్మిడివరం నగర పంచాయతీ సమావేశం జరుగుతున్న దృశ్యం

ముమ్మిడివరం: మండలంలో నెలకొన్న సమస్యలు, అధికారుల తీరుపై నగర పంచాయతీ కౌన్సిల్ సభ్యులు ధ్వజమెత్తారు. శుక్రవారం కౌన్సిల్ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన సమావేశం జరిగింది. నగర పంచాయతీలో చెత్తను సక్రమంగా తొలగించడం లేదని, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేయడం లేదని, వీధి దీపాలు సరిగా వెలగడం లేదని, టౌన్ ప్లానింగ్ అధికారులు ఆక్రమణ తొలగింపు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక దశలో చైర్మన్ ప్రవీణ్‌కుమార్ కూడా అసహనం వ్యక్తం చేశారు. ఇరిగేషన్ ఎలక్ట్రికల్, వైద్యశాఖ అధికారులు సమావేశానికి గైర్హాజరు కావడంపై వారిపై చర్యలకు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని తీర్మానించారు. సమావేశంలో వైస్ చైర్మన్ వేటూరి బోసురాజు, రెడ్డి హేమసుందరి, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముంపునీరు దిగేందుకు ముమ్మర చర్యలు



సుంకరపాలెం జంక్షన్‌లో ముంపునీరు పోయేందుకు పనులు ప్రారంభిస్తున్న నాగేశ్వరరావు

తాళ్లరేవు: గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు యానాం–ద్రాక్షారామ రహదారితో పాటు కుళాయి చెరువు చెంత ఉన్న కాలనీ పూర్తిగా నీటమునగడంతో ఆ ముంపునీరు దిగేందుకు ముమ్మర చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ఆదేశాల మేరకు మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు, సుంకరపాలెం సర్పంచ్ టిళ్ల పూడి నాగేశ్వరరావు, టీడీపీ నాయకుడు వేగేశ్న భాస్కరరాజు పర్యవేక్షణలో ముంపు నివారణ చర్యలు ప్రారంభించారు. ముంపునీరు పోయేందుకు పొక్లెయిన్ సహాయంతో తాత్కాలిక డ్రైనేజీ ఏర్పాటు పనులు ముమ్మరంగా చేస్తున్నారు. కార్యక్రమంలో సుంకరపాలెం వర్తక సంఘం అధ్యక్షుడు నామా గోపాలకృష్ణ, ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం



చరిత్ర అధ్యాపకుడు సూర్యనారాయణరాజును సత్కరిస్తున్న దృశ్యం

ముమ్మిడివరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మలికిపురం ఎంవీఎన్‌జేఎస్ ఆర్‌వీఆర్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ చరిత్ర అధ్యాపకుడు సూర్యనారాయణరాజు మాట్లాడుతూ పర్యాటకం అనేది కనిపించే వినోదం మాత్రమే కాదని, ఆర్థిక వృద్ధికి ఎంతగానో దోహద పడుతుందన్నారు. అలాగే పర్యాటక ప్రదేశంలో అనేక మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. టూరిజం అండ్ ఎకనామిక్ గ్రోత్ గురించి పలువురు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ప్రభాకర్, వైస్ ప్రిన్సిపాల్ కె.చిట్టిబాబు, డా.ఎన్.తులసీలక్ష్మి, సీహెచ్ పాల్సన్, అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు పలు పోటీల నిర్వహణ

అమలాపురం రూరల్: వివిధ ప్రాంతాలు, వివిధ స్థలాలు, వివిధ దేశాలు పర్యటించడం వల్ల వినోదంతో పాటు విజ్ఞానం లభిస్తుందని ఎస్‌కేబీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ నూకల శ్రీనివాస్ అన్నారు. ఎస్‌కేబీఆర్ కళాశాల ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా జిల్లా పర్యాటక సంస్థ, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు విభాగంలో శుక్రవారం వేడుకలు నిర్వహించారు. ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు నిర్వహించిన వక్తృత్వం, కూచిపూడి నృత్య పోటీల్లో విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందించారు. తెలుగు విభాగాధిపతి ఎస్ఆర్ఎస్ కొల్లూరి, తెలుగు అధ్యాపకులు పెమ్మరాజు గోపాల్, డాక్టర్ కేటీ పద్మజ, పర్యాటక అధికారులు నల్లా ఉదయ్, సతీష్, ఎస్.శ్రీరామచంద్రమూర్తి, ఎన్.హైమావతి పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ల బాధ్యతల స్వీకరణ



శ్రీలక్ష్మి



రత్నకుమార్‌ను సత్కరించి వీడ్కోలు పలుకుతున్న స్టాంపు వెండర్లు, దస్తావేజు లేఖర్లు

అమలాపురం టౌన్: జిల్లా కేంద్రం అమలాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జాయింట్–1 సబ్ రిజిస్ట్రార్‌గా ఆర్.శ్రీలక్ష్మి, జాయింట్–2 సబ్ రిజిస్ట్రార్‌గా లక్ష్మణరాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీలక్ష్మి ద్రాక్షారామ సబ్ రిజిస్ట్రార్‌గా, లక్ష్మణరాజు పశ్చిమ గోదావరి జిల్లా గునిపూడి సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తూ అమలాపురానికి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకూ ఇక్కడ జాయింట్–1 సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన రత్నకుమార్ ఆత్రేయపురం, జాయింట్–2 సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన సత్యనారాయణ అల్లవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు బదిలీలపై వెళ్లారు. వీరితో పాటు అమలాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి బదిలీలపై వచ్చిన సీనియర్ అసిస్టెంట్, ముగ్గురు జూనియర్ అసిస్టెంట్లు, ఇక షరాబు, ఒక అటెండర్ కూడా శుక్రవారం విధుల్లో చేరి బాధ్యతలు చేపట్టారు.

రత్నకుమార్ సేవలు అభినందనీయం

స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం జాయింట్–1 సబ్ రిజిస్ట్రార్ రత్నకుమార్ సేవలు అభినందనీయమని స్టాంపు వెండర్లు, దస్తావేజు లేఖర్ల సంఘం ప్రతినిధులు కొనియాడారు. అమలాపురం సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తూ ఆత్రేయపురం సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీపై వెళుతున్న రత్నకుమార్‌ను స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్టాంపు వెండర్లు, దస్తావేజు లేఖర్లు శుక్రవారం సాయంత్రం ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. అమలాపురం స్టాంపు వెండర్లు, దస్తావేజు లేఖర్ల సంఘం ప్రతినిధులు మట్టపర్తి రాము, గనిశెట్టి భోగిరాజు, జున్నూరి సురేష్ తదితరులు బదిలీపై వెళుతున్న సబ్ రిజిస్ట్రార్ రత్నకుమార్‌కు జ్ఞాపికలు, నూతన వస్త్రాలు బహూకరించి ఘనంగా వీడ్కోలు పలికారు.

పంట కోత ప్రయోగాలపై జాగ్రత్తలు తీసుకోవాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ షంషీ

అమలాపురం రూరల్: పంట కోత ప్రయోగాలు చేసే విధానంపై జాగ్రత్తల తీసుకోవాలని అమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకుడు ఎంఏ షంషీ వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు సూచించారు. అమలాపురం మండల పరిషత్ కార్యాలయంలో ఏడీఏ అధ్యక్షతన శుక్రవారం అమలాపురం సబ్ డివిజన్ పరిధిలోని గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు, పంట కోత ప్రయోగాలు, సీఎల్ఎస్, ఏడీఎస్ఎస్ యాప్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి మనోహర్ సీఎల్ఎస్, పీడీఎస్ఎస్ యాప్ ఉపయోగించే విధానం, పంట దశ ఫొటోలు యాప్‌లో పంపించే విధానం గురించి వివరించారు. ఈ శిక్షణలో అమలాపురం, అల్లవరం, అయినవిల్లి, ఉప్పలగుప్తం మండల వ్యవసాయాధికారులు కె.ధర్మప్రసాద్, సత్యనారాయణ, శోభ, కుమార్‌బాబు, హబ్ మేనేజర్ సునీత, వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రేమ్‌కుమార్, శివమోహన్, గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

పంచనదీ జలాలతో సంప్రోక్షణ

తాళ్లరేవు: తిరుమల శ్రీవారి లడ్డూలో జరిగిన అపవిత్రతకు ప్రాయశ్చిత్తంగా సమరసత సేవా ఫౌండేషన్ సీతా సమేత కల్యాణ రామస్వామి ఆలయ ట్రస్ట్ ఆధ్వర్యంలో పంచనదీ జలాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీహెచ్ గున్నేపల్లిలోని సీతా సమేత కల్యాణ రామస్వామి ఆలయంలో కల్యాణ వెంకటేశ్వరస్వామికి క్షమాపణ చెబుతూ ఆలయ శుద్ధి చేశారు. ఈ కార్యక్రమంలో సేవా ఫౌండేషన్ ప్రతినిధులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీలకు దీపావళి కానుక

యానాం: దీపావళిని పురస్కరించుకుని పుదుచ్చేరి ప్రభుత్వం ఆదిద్రావిడ, షెడ్యూల్డ్ ట్రైబ్ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో యానాం నియోజకవర్గ పరిధిలో ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా దుస్తులు పంపిణీ చేయనున్నారని ఆదిద్రావిడ వెల్ఫేర్, ఎస్టీ సంక్షేమశాఖ ఏడీ రేకాడి కృష్ణమూర్తి ప్రకటనలో తెలిపారు. దుస్తులకు సమానమైన నగదును పంపిణీ చేస్తారన్నారు. కావున యువతీయువకులు 18 ఏళ్లు నిండినవారు, కొత్తగా రేషన్‌కార్డులో నమోదైన వారు తమ ఆధార్, రేషన్‌కార్డుల, బ్యాంక్‌పాస్ పుస్తక జిరాక్స్ కాపీలతో తమ కార్యాలయంలో అక్టోబర్ 10లోగా అందజేయాలని కోరారు.

మాజీ సీఎం జగన్‌ను కలసిన రమణారావు



మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి నియోజకవర్గ పరిస్థితులు వివరిస్తున్న రమణారావు

ఉప్పలగుప్తం: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని అమలాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకుడు, గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. తాడేపల్లిలోని జగన్‌ను రమణారావు కలసి తాను పార్టీ అభివృద్ధికి చేసిన కృషిని వివరించానన్నారు. అమలాపురం నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులను జగన్‌తో చర్చించానని ఆయన స్థానిక విలేకరులకు వివరించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసి పార్టీకి పూర్వవైభవాన్ని తీసుకురావాలని జగన్ తనకు సూచించినట్లు రమణారావు తెలిపారు.

క్రైం రేటు తగ్గించాలి

అమలాపురం టౌన్: జిల్లాలో క్రైమ్ రేటును తగ్గించేందుకు అధికారులు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని ఎస్పీ బి.కృష్ణారావు సూచించారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలతో శుక్రవారం రాత్రి నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా ఏఎస్పీ ప్రసాద్ కూడా పాల్గొని పలు నేరాల నిరోధానికి సూచనలు ఇచ్చారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు రాజీ పడేది లేదని ఎస్పీ స్పష్టం చేశారు. దీపావళి దగ్గర పడుతున్న నేపథ్యంలో అనధికార బాణసంచా తయారీ కేంద్రాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. ఇటీవల అమలాపురం రావులచెరువు ప్రాంతంలో ఓ ఇంట్లో జరిగిన విస్ఫోటంపై సమీక్షించారు. అమలాపురం, రామచంద్రపురం, కొత్తపేట డీఎస్పీలు టీఎస్ఆర్‌కే ప్రసాద్, టి.రామకృష్ణ, గోవిందరావు, స్పెషల్ బ్రాంచ్ సీఐలు బి.రాజశేఖర్, వి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు కుక్కలకు ఉచిత టీకాలు

అమలాపురం టౌన్: జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ రేబిస్ దినోత్సవాలు జిల్లా వ్యాప్తంగా ఉన్న పశు వైద్య శాలల్లో శనివారం జరగనున్నాయి. జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వెంకట్రావు ఆధ్వర్యంలో ఈ దినోత్సవాలు, కుక్కలకు ఉచిత రేబిస్ టీకా శిబిరాలు నిర్వహిస్తారు. అమలాపురంలోని ప్రాంతీయ పశు వైద్యశాలలో రేబిస్ దినోత్సవానికి సంబంధించి ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సహాయ సంచాలకుడు డాక్టర్ ఎల్.విజయరెడ్డి తెలిపారు. అమలాపురం ప్రాంతీయ వైద్యశాలతో పాటు వన్నె చింతలపూడి, బండార్లంక, ఈదరపల్లి, అల్లవరం, దేవగుప్తం, కొమరగిరిపట్నం పశువుల ఆస్పత్రుల్లో పెంపుడు, వీధి కుక్కలకు ఉచిత రేబిస్ టీకాలు వేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని కుక్కల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

విద్యార్థుల రక్తదానం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు

తాళ్లరేవు: మండలంలోని సుంకరపాలెంలోని రవి డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 50 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. పలు లయన్స్‌క్లబ్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ రక్తదాన శిబిరాన్ని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ప్రారంభించారు. రక్తాన్ని సేకరించి కాకినాడ రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకుకు అందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రతినిధి పెద్దిరెడ్డి ఉమామహేశ్వరరావు, కాకినాడ, అమలాపురం, వశిష్ఠ, కోనసీమ, పిఠాపురం శ్రీపాద శ్రీవల్లభ, తాళ్లరేవు, యానాం, కసకాలపేట, కాపులపాలెం గోల్డెన్ క్లబ్బుల ప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వృద్ధురాలి మృతి



సాపే సుందరమ్మ

కాట్రేనికోన: పల్లంకుర్రుకు చెందిన వృద్ధురాలు సాపే సుందరమ్మ (91) మృతి చెందారు. పల్లంకుర్రుకు చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు సాపే సూర్యప్రకాష్‌కు ఈమె తల్లి. సుందరమ్మ మృతికి పలువురు నాయకులు సంతాపం తెలిపారు. మాతృవియోగంతో బాధపడుతున్న సూర్యప్రకాష్‌ను ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ఫోన్‌లో పరామర్శించారు. పల్లంకుర్రు సర్పంచి నాతి అలివేణి, నాతి సత్యనారాయణ, పలువురు నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వరద బాధితులకు పేరూరు విద్యార్థుల సాయం

అమలాపురం రూరల్: విజయవాడ బాధితుల సహాయార్థం పేరూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సమీకరించిన రూ.25,999 వేల విరాళాలు సీఎం సహాయ నిధికి అందించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్‌కు కలెక్టరేట్‌ను చెక్కు అందించారు. వితరణ అందించిన విద్యార్థులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కడలి శ్రీనివాసరావు, ఉపాధ్యాయ బృందాన్ని జిల్లా కలెక్టర్ అభినందించారు. జిల్లా ఉపవిద్యాశాఖ అధికారి గుబ్బల సూర్యప్రకాశం, ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నాగిరెడ్డి శివప్రసాద్ తదితరులు విద్యార్థులను అభినందించారు.